క్లుప్తంగా

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష

నాగులుప్పలపాడు: అన్ని రకాల వ్యాధుల నుంచి పిల్లలను రక్షించడానికి తల్లిపాలు చాలా కీలకంగా ఉపయోగపడుతుందని నాగులుప్పలపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ఓనా రియెల్ అన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా సోమవారం చదలవాడలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కార్యక్రమం చేయడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రమీల, ఏఎన్ఎంలు, ఆశా కార్యాకర్తలు ఉన్నారు.

ఘనంగా ఆలయ వార్షికోత్సవం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

ఒంగోలు మెట్రో: నగరంలోని కర్నూలురోడ్ గణపతినగర్‌లోని అభయాంజనేయస్వామి దేవస్థాన ఐదవ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిని ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

ఏకేయూ యూనివర్శిటీ వైస్ ఛాన్స్‌లర్‌కు అభినందనలు



వైస్ ఛాన్స్‌లర్‌ను అభినందిస్తున్న కళాశాలల చైర్మన్లు, కరస్పాండెంట్లు, ప్రిన్సిపాళ్లు

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ నూతన ఇన్‌చార్జి వైస్ ఛాన్స్‌లర్‌గా బాధ్యతలు స్వీకరించిన ప్రొఫెసర్ డీవీఆర్ మూర్తిని సోమవారం పలు కళాశాలల యాజమాన్యాలు కలిసి ఘనంగా సన్మానించారు. ఇందిరా ప్రియదర్శిని కళాశాల చైర్మన్ డాక్టర్ కె.నరసింగరావు, కరస్పాండెంట్ సీవీ రామక్రిష్ణారావు, పాలకమండలి సభ్యులు బత్తిన మహేష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె నటరాజ్, ఏకేయూ విశ్రాంత ప్రొఫెసర్ కాటా వెంకటరెడ్డిలు, వివేకానంద విద్యాసంస్థల కరస్పాండెంట్ బండి వెంకటేశ్వర్లు, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అబ్బూరి వెంకటేశ్వర్లు, పాదిలి ఎస్‌యూ విద్యాబోధన కళాశాల చైర్మన్ జాఫర్ ఆలీ తదితరులు వైస్ ఛాన్స్‌లర్‌ను సన్మానించి అభినందించారు. అనంతరం యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ బి.హరిబాబును కలిసి పలు అంశాలపై మాట్లాడారు.

నువ్వుల పంట పరిశీలన



ఒంగోలు సెంట్రల్: పేర్నమిట్ట పొలాల్లో సాగు చేసిన వర్షాభావ పరిస్థితుల్లో వాడుముఖం పట్టిన నువ్వుల పంటను జిల్లా వ్యవసాయాధికారి శ్రీనివాసరావు బృందం సోమవారం పరిశీలించారు. నువ్వుల పంట వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో వాడుముఖం పట్టిందని, ఈ పంటను తక్షణమే ఈ- పంటలో నమోదు చేయాలని వ్యవసాయ సహాయకులను ఆదేశించారు. రైతులు కూడా గ్రామ సహాయకులను కలిసి సాగు చేసిన భూమి సర్వే నంబర్, ఆధార్ ఇతర వివరాలు ఇవ్వాలని కోరారు. నువ్వులు పంట విషయం ప్రభుత్వానికి తెలియజేసి మళ్లీ సాగు చేసుకునేందుకు రాయితీపై విత్తనాలు లేదా పంట నష్టపరిహారం అందేలా చూస్తామని చెప్పారు. ఏడీఏ రమేష్ బాబు మాట్లాడుతూ రైతులు తాము సాగు చేసిన పంటను ఈ- పంట నమోదు చేసుకోవాలని, దాని వల్ల ప్రభుత్వ పథకాలు అందుతాయని చెప్పారు. భూసార సంరక్షణ విభాగం డీడీఏ ఎం సుబ్రహ్మణేశ్వరరావు,మేఈఓ సుబ్బా రెడ్డి, ఎంపీఈఓ జానకి పాల్గొన్నారు.

చదువు చెప్పే వారేరీ..?

- ఉపాధ్యాయుల కొరత..పడిపోతున్న విద్యాప్రమాణాలు
- పూర్తి స్థాయిలో అందని స్టూడెంట్స్ కిట్
- తగ్గిన చిక్కీల సైజు

చీమకుర్తి/మద్దిపాడు/నాగులుప్పలపాడు: ప్రభుత్వ పాఠశాలల్లో సబ్జక్టు టీచర్ల కొరత విద్యార్థుల విద్యా ప్రమాణాలపై తీవ్రంగా ప్రభావం చూపుతోంది. రెండేళ్ల క్రితం జరిగిన ఉపాధ్యాయుల బదిలీల తర్వాత నుంచి ఇప్పటి వరకు ఉద్యోగుల విరమణతో సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లోని సుమారు 45 హైస్కూళ్లలో దాదాపు 35 మంది సబ్జక్టు టీచర్ల కొరత ఉంది. వాటితో పాటు హైస్కూళ్లు, ఎంఈఓ-2 పదోన్నతుల్లో మరో 10 మంది టీచర్‌లు వెళ్లటంతో హైస్కూళ్లలో వారికి సంబంధించిన సబ్జక్టులను బోధించే వారు లేక విద్యాప్రమాణాలు దెబ్బతింటున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు 15 ఏకోపాధ్యాయ పాఠశాలలున్నాయి.

పాఠశాలల్లోని వందలాది మంది విద్యార్థులకు సురక్షితమైన తాగునీరు లేక పాఠశాల ఆవరణల్లో దొరికే బోరు నీరే ప్రధాన ఆధారంగా మారింది. పంచాయితీ నీరు వదిలినప్పుడు పాఠశాలల సమయానికి ముందు లేక పాఠశాల సమయాలు ముగిసిన తర్వాత వస్తుండటంతో వాటిని వాడుకునేందుకు వీలు లేకుండా పోయింది. గత ప్రభుత్వంలో అందించిన చిక్కీలకు ఇప్పుడు వచ్చిన ప్రభుత్వం వచ్చిన తర్వాత అందిస్తున్న చిక్కీలను పోలిస్తే సగానికి సగం సైజు తగ్గినట్లు విద్యార్థులు చెబుతున్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యత తగ్గటం, కొన్ని పాఠశాలల్లో కుకింగ్ ఏజన్సీలపై రాజకీయ ప్రభావం పడటంతో మధ్యాహ్న భోజనం నాణ్యత బాగులేదనే ఆరోపణలు వస్తున్నాయి. ఏటా పాఠశాలలు తీసే సమయానికి విద్యార్థులకు అమ్మ ఒడి ద్వారా ప్రతి తల్లికి రూ.15 వేలు అందించటం వలన వాటితో విద్యార్థులకు అవసరమైన నోట్‌పుస్తకాలు, ఇతర వస్తువులను కొనుగోలు చేసేందుకు తోడ్పడుతుంది. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఎన్నికల హామీలో ఎంత మంది ఉంటే అంత మందికి తల్లికి వందనం ఇస్తామంటూ ఇచ్చిన హామీ సంగతి దేవుడెరుగు ఒక్క విద్యార్థికి కూడా ఇవ్వకపోవడం శోచనీయమని తల్లిదండ్రులు వాపోతున్నారు. దాని వలన నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో కలిపి 60 వేల మంది పిల్లలకు తల్లికి వందనం డబ్బులు ఇవ్వాల్సి ఉంటుంది.



బండ్లమిట్ట ప్రభుత్వ బాలికల హైస్కూల్ ఆవరణలో అసంపూర్తిగా ఉన్న (శ్లాబ్ వేసిన) భవనంలో తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

ఒంగోలు: ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల కూత మోగుతోంది. జిల్లా కేంద్రం, చుట్టుపక్కల ప్రాంతాలు కావడంతో ఈ ప్రాంతంలో ప్రాథమిక పాఠశాలల్లో మిగులు ఉపాధ్యాయులు ఉంటే ఉన్నత పాఠశాలల్లో మాత్రం ఉపాధ్యాయుల కొరత వేధిస్తుంది. తాత్కాలికంగా ప్రాథమిక పాఠశాలల్లోని ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలలకు సర్దుబాటు చేశారు. అయితే మరో వారంలో ప్రభుత్వమే పని సర్దుబాటు ప్రక్రియను ఆన్‌లైన్ ద్వారా చేయాలని నిర్ణయించనుంది. కొన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌పీ ప్యానళ్లు, ల్యాబ్‌ల సమస్య నెలకొంది. మధ్యాహ్న భోజన పథకంలో కుకింగ్ ఏజెన్సీలను స్థానిక టీడీపీ నేతలు బలవంతంగా తొలగించి వారికి వారి అనుకూలమైన వారికి ఇప్పించారు. ఈ గందరగోళం నడుమ మధ్యాహ్న భోజనంలో కొంత నాణ్యత తగ్గింది.



ఇది సాంబారు కాదు.. కుర్మానే

40 మంది మిగులు ఉపాధ్యాయులు:

ఒంగోలు పట్టణం, ఒంగోలు మండలంలో 56 ప్రాథమిక, 3 ప్రాథమికోన్నత, 20 ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో కరవది ఉన్నత పాఠశాల హైస్కూలు ప్లస్‌గా మారింది. ఇందులో ఇంటర్ తరగతులు బోధిస్తున్నారు. అయితే ఈ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ ఉన్నా ల్యాబ్‌ల కొరత విద్యార్థులను వేధిస్తుంది. ముక్తినూతలపాడు ఉన్నత పాఠశాలలో బాలుర మరుగుదొడ్ల నిర్మాణం అసంపూర్తిగా ఉండడంతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. ఉలిచిలో ఇంగ్లిషు టీచర్, డిజిటల్ క్లాసురూముల కొరత ఉంది, ఇక గుండాయపాలెం స్కూలులో అయితే సైన్స్ టీచర్, ఫిజికల్ డైరెక్టర్, వాచ్‌మెన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి . మండువవారిపాలెంలో ఉన్న ప్రాథమిక పాఠశాల ఒక్కటే ఏకోపాధ్యాయ పాఠశాలగా ఉంది.

తగ్గిన రుచి..

మధ్యాహ్న భోజనంలో రుచి తగ్గిందని విద్యార్థులు, తల్లిదండ్రులు వాపోతున్నారు. కొన్ని పాఠశాలల్లో మాత్రనే వంట వండుతున్నారు. ఎక్కువశాతం పాఠశాలల్లో ఇళ్ల వద్ద వండుకొని తీసుకువస్తున్నారు.

ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల సేవలను వినియోగించుకోవాలి



జిల్లాలో ఖాళీగా ఉన్న ఎయిడెడ్ ఉపాధ్యాయుల సేవలను ప్రభుత్వం వినియోగించుకోవాలి. జిల్లాలో 98 మంది విద్యార్థులు పూర్తిగా సున్నా శాతం విద్యార్థులు ఉన్న పాఠశాలల్లో, మరో 53 మంది మిగులు ఉపాధ్యాయులు ఉన్నారు. వీరిని ప్రభుత్వ పాఠశాలల్లోకి శాశ్వతంగా విలీనం చేసినట్లయితే కొంతమేర ఉపాధ్యాయుల కొరతకు పరిష్కారం లభిస్తుంది.

– సీహెచ్ ప్రభాకరరెడ్డి , ఏపీటీజీ జిల్లా ప్రధాన కార్యదర్శి

తల్లికి వందనం అమలు చేయాలి



అమ్మ ఒడి పథకం మాలాంటి పేదలకు చాలా ఉపయోగకరంగా ఉంది. ప్రస్తుత ప్రభుత్వం కూడా గత ప్రభుత్వం లాగానే ఇచ్చిన మాటను నిలబెట్టుకొని తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని కోరుతున్నాం.

– అనూష, చదలవాడ

ఉపాధ్యాయుల నియామకంపై దృష్టిపెట్టాలి



ఉపాధ్యాయుల నియామకంపై ప్రభుత్వం దృష్టి పెట్టాలి. గత ప్రభుత్వం 6వేల పోస్టులతో డీఎస్సీ అంటే మెగా డీఎస్సీ పేరుతో ప్రస్తుత ప్రభుత్వం 16వేల పోస్టులను ప్రకటించింది. వాస్తవానికి రిటైర్‌మెంట్ అయ్యే ఉపాధ్యాయుల సంఖ్య ఎక్కువగా ఉంది. డిసెంబర్ వరకు కలుపుకుంటే భారీగా జిల్లాలోనే ఉపాధ్యాయులు అవసరం అవుతారు. కనుక ఈ డీఎస్సీలోనే అన్ని ఖాళీ పోస్టులను భర్తీచేసేందుకు నోటిఫికేషన్ విడుదల చేయాలి.

– పీవీ సుబ్బారావు, ఐఫియా కౌన్సిలర్

62 మంది వృద్ధులకు కంటి ఆపరేషన్లు



కంటి చికిత్సలకు తరలివెళుతున్న వృద్ధులతో ఆస్పత్రి డాక్టర్ జగదీష్, వైద్యసిబ్బంది

మద్దిపాడు: మండల కేంద్రం మద్దిపాడు పీహెచ్‌సీ నుంచి 62 మంది వృద్ధులు కంటి ఆపరేషన్ల నిమిత్తం శంకర నేత్రాలయకు సోమవారం తరలి వెళ్లారు. ఆస్పత్రి డాక్టర్‌లు శ్రావణ్, జగదీష్ మాట్లాడుతూ 50 సంవత్సరాలు దాటిన వారిలో కంటి సమస్యలు ఏర్పడుతుంటాయని అందులో ఎక్కువగా శుక్లం వస్తుందని, దానికి కంటి ఆపరేషన్ చేయించాలని అన్నారు. తొలి దశలోనే శుక్లాలను గుర్తించి సాధారణ శస్త్ర చికిత్సలతో నివారించవచ్చన్నారు. కంటికి ఏదైనా పొర అడ్డుపడినట్లు అనిపిస్తే వెంటనే నేత్ర వైద్యులను సంప్రదించాలని తెలిపారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ జయరాజ్ మాట్లాడుతూ మొత్తం 190 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని వారిలో 62కి శస్త్ర చికిత్స చేయించాల్సి రావడంతో వారిని శంకర నేత్రాలయకు తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ప్రాథమిక ఆరోగ్యశాఖ సిబ్బంది పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

ఏకేయూ యూనివర్శిటీ ప్రాంగణం పరిశీలన

ఒంగోలు సెంట్రల్: ఆంధ్రకేసరి యూనివర్శిటీ పేర్నమిట్ట ప్రాంగణాన్ని సోమవారం ఏకేయూ ఉప కులపతి ప్రొఫెసర్ డీవీవీఆర్ మూర్తి సందర్శించారు. సదరు ప్రాంగణంలో ఉన్న భవనాన్ని ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. ప్రస్తుతం ఉన్న భవనంలోని గదులు పరిపాలన కార్యక్రమాల నిర్వహించేందుకు ఏ విధంగా కేటాయించాలనే విషయాన్ని వీసీ ప్రొఫెసర్ మూర్తితో రిజిస్ట్రార్ హరిబాబు చర్చించారు. నిధులు మంజూరైతే ప్రస్తుతం ఉన్న భవనంపై మరో భవనాన్ని నిర్మిస్తే పరిపాలన అధికారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఉంటాయని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. నూతన భవనాలు నిర్మించేందుకు అనువైన స్థలాలతో పాటుగా క్రీడా ప్రాంగణాన్ని కూడా పరిశీలించారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ షణ్ముఖ శ్రీనివాస్ ఉన్నారు.

తహసీల్దార్‌ల బాధ్యతల స్వీకరణ

నాగులుప్పలపాడు: నాగులుప్పలపాడు మండల తహసీల్దార్ గా ప్రవీణ్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల అనంతరం తహసీల్దార్ లను సర్దుబాటు చేసే క్రమంలో ప్రవీణ్‌కుమార్‌ను నాగులుప్పలపాడుకు బదిలీ చేయగా సోమవారం కార్యాలయంలో భాధ్యత లు స్వీకరించారు. బదిలీపై చేరిన తహసీల్దార్‌ను కా ర్యాలయ సిబ్బంది కలిసి పుష్ప గుచ్ఛం అందజేశారు.

మద్దిపాడు తహశీల్దార్‌గా సుజన్ కుమార్

మద్దిపాడు: మండల నూతన తహశీల్దార్‌గా ఎం సుజన్ కుమార్ పదవీ బాధ్యతలు సోమవారం సాయంత్రం స్వీకరించారు. గతంలో ఆయన నాగులుప్పలపాడు మండల తహశీల్దార్‌గా పని చేస్తూ ఎన్నికల నేపథ్యంలో ఒంగోలు ఎలక్షన్ సెల్‌కు వెళ్లారు. అక్కడ నుంచి ఆయన సోమవారం బదిలీపై మద్దిపాడులో బాధ్యతలు స్వీకరించారు. మండలంలో సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు తాను కృషి చేస్తానని తెలిపారు.

కొత్తపట్నం తహసీల్దార్‌గా మధుసూదన్‌రావు

కొత్తపట్నం: తహసీల్దార్‌గా పిన్నిక మధుసూదనరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సిబ్బంది నిష్పక్షపాతంగా పనిచేసి ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకోకుండా పనిచేయాలన్నారు. డీటీ అర్జున్‌రెడ్డి, ఆర్ఐ వరప్రసాద్, ఏఎస్ఓ కోటేశ్వరరావు, వీఆర్వోలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



ఎం సుజన్ కుమార్



మధుసూదనరావు

నిత్యావసరాలు అందజేత

ఒంగోలు మెట్రో: నగరంలోని జాషువా కాలనీలో పక్షవాతంతో బాధపడుతున్న ఆనందరావు అనే వ్యక్తికి మేము సైతం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఎస్ఎల్‌జీ గ్రూప్స్ అధినేత మల్లెడి వీర రాఘవరెడ్డి ఆర్థిక సహకారంతో నిత్యావసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ చైర్మన్ శ్రీనివాసరావు మాట్లడుతూ ఆనందరావు ఏడేళ్లుగా పక్షవాతంతో మంచంలోనే ఉంటున్నాడని, విషయాన్ని దాతల దృష్టికి తీసుకువెళ్లగా మల్లెడి వీరరాఘవరెడ్డి ముందుకు వచ్చి నిత్యావసరాలు అందజేశారన్నారు. మనోజ్ కుమార్, జయకుమార్, కిషోర్, నరసింహారావు, భూపతి రమేష్, సుధీర్, జాన్ పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో మరకత శివలింగం

ఒంగోలు మెట్రో: శ్రావణ సోమవారం సందర్భంగా నగరంలోని పలు శైవక్షేత్రాల్లో భక్తిశ్రద్ధలతో అభిషేకాలు నిర్వహించారు. స్థానిక కేశవస్వామిపేట కాశీ విశ్వనాథుని దేవస్థానంలో, లాయరుపేట షిర్డీ సాయిబాబా మందిరంలో ఉపాలయంగా ఉన్న మరకత శివలింగానికి, కొత్తపట్నం బస్టాండ్ దగ్గర శివాలయంలో, మంగమూరు రోడ్డు గాంధీనగర్ మూడో లైన్లో రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో, బాలాజీరావు పేట కనకదుర్గమ్మ ఆలయంలో ఉపాలయంగా ఉన్న దుర్గా మల్లేశ్వరస్వామికి, అంజయ్య రోడ్డులో శివ సాయి పంచముఖ శివాలయంలో, సమతానగర్ సాగర్ కాల్వ దగ్గర దుర్గా మల్లేశ్వరస్వామి దేవస్థానంలో, సంతపేట షిర్డీ సాయిబాబా మందిరంలో కాశీ విశ్వేశ్వరునికి, రంగారాయుడు చెరువు దగ్గర అరుణాచలేశ్వర స్వామికి ఆలయ అర్చకులు శివలింగానికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం, బిల్వార్చన చేశారు. అనంతరం మహానందీశ్వరుడికి ధూప దీప హారతులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జాతీయ సమ్మేళనాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

ఒంగోలు టౌన్: విశాఖలో వచ్చే నెల ఒకటి నుంచి 3వ తేదీ వరకు నిర్వహించనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాలను జయప్రదం చేయాలని ఆ సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తకోట వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు. జాతీయ సమ్మేళనల వాల్‌పోస్టర్‌ను సోమవారం మల్లయ్య లింగం భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణను ఆపాలని, కార్పొరేట్ సంపదను పునఃపంపిణీ జరపాలని డిమాండ్ చేశారు. గత 10 ఏళ్లుగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను అప్పనంగా కార్పొరేట్ శక్తులకు అప్పగించిందని మండిపడ్డారు. ఉద్యోగులు, కార్మికులు, తమ హక్కుల కోసం ఉద్యమించాల్సిన అవసరం ఉందన్నారు. కరోనా కష్ట కాలంలో ప్రాణాలకు తెగించి విధులు నిర్వహించిన పారిశుధ్య కార్మికులను ఆప్కాస్‌లో చేర్చి పనిభద్రత కల్పించాలని మున్సిపల్ కార్మిక నాయకులు శ్రీరాం శ్రీనివాస్ కోరారు. ఎలాంటి చట్టరక్షణ లేకుండా జీవితాలు గడుపుతున్న హమాలీలు, ఆటో కార్మికులు, వీధి వ్యాపారులు, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని సీపీఐ నగర కార్యదర్శి పీవీఆర్ చౌదరి విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పావులూరు అంజయ్య, సీహెచ్ వెంకటేశ్వర్లు, మంద ఇజ్రాయిల్, దాసరి పెదబాబు, గద్దల బాలకోటయ్య పాల్గొన్నారు.

దళితులను ఆర్థికంగా దెబ్బతీయాలని కుట్ర

- అందరం కలిసి న్యాయ పోరాటం చేస్తాం
- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య



మాట్లాడుతున్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య

ఒంగోలు సెంట్రల్: రాష్ట్రంలో దళితులను రెండుగా చీల్చి ఆర్థికంగా దెబ్బతీయాలనే కుట్రతో టీడీపీ, బీజేపీ వ్యవహరిస్తున్నాయని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య ఆరోపించారు. ఒంగోలులోని అంబేడ్కర్ భవన్‌లో మాల మహానాడు రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ బత్తుల వెంకటరావు అధ్యక్షతన వర్గీకరణ వ్యతిరేక పోరాటం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బిల్లా చెన్నయ్య మాట్లాడుతూ టీడీపీ, బీజేపీలు కుట్ర పన్ని ఆర్టికల్ 341 రాజ్యాంగాన్ని అవహేళన చేసి సుప్రీంకోర్టులో తీర్పు తీసుకువచ్చారన్నారు. మాజీ ఎంపీ హర్షకుమార్ ఆధ్వర్యంలో మాలలంతా కలిసి ఒకటిగా సుప్రీం కోర్టులో రివ్యూ పిటిషన్ వేసి న్యాయ పోరాటం చేస్తామన్నారు. పల్లె, పట్నంలలో సైతం పోరాటాలు చేసి మాల జాతికి న్యాయం జరిగే వరకు ప్రాణ త్యాగానికైనా సిద్ధం కావాలన్నారు. అంబటి కొండల రావు, పులి వికాస్, బత్తుల సుబ్బయ్య, మేడికొండ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు పంపిణీ



విద్యార్థులకు నగదు అందజేస్తున్న దృశ్యం

ఒంగోలు సిటీ: పదో తరగతి, ఇంటర్ పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు దాతలు నగదు పురస్కారాలు అందజేశారు. ది విశాఖపట్నం కో ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ ఆధ్వర్యంలో సోమవారం నారాయణ ఇంగ్లిష్ మీడియం స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి బ్యాంకు వైస్ చైర్మన్ ముదివర్తి రాఘవరావు అధ్యక్షత వహించారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పబ్బిశెట్టి మహాలక్ష్మీ, నేలపాటి అనన్యశ్రీ విద్యార్థులకు రూ.5 వేలు చొప్పున నగదు అందజేశారు. ఇంటర్‌లో ఆవుల నాగకార్తీక్, పాలమర్తి కావ్య, పబ్బిశెట్టి సాయి కుమార్, నూతలపాటి యశస్విని, ఉప్పలపాటి పెద్ద వెంకట చేతన్, పంగులూరి హర్షిత, ఇంటర్ విద్యార్థులకు రూ.7,500 చొప్పున ఉత్తమ ఫలితాలు సాధించిన 8 మందికి నగదు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు బోర్డు ఆఫ్ మేనేజ్‌మెంట్ సభ్యులు వడ్డీల సింగయ్య, ప్రిన్సిపాల్ సయ్యద్ నాగూర్ వలి, ఏజీఎం పెద్దిరెడ్డి, బ్రాంచ్ మేనేజర్ వీరవల్లి బంగారుబాబు, బ్యాంకు కమిటీ సభ్యులు కొల్లా సుబ్బారావు, చౌదరి, నాతాని బ్రహ్మానందం, తల్లిదండ్రులు, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలి

ఒంగోలు రూరల్ : ఉపాధి పనులు సక్రమంగా జరిగేలా చూడాలని ఏపీడీ పి.వెంకటస్వామి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఒంగోలు, కొత్తపట్నం మండలాల ఉపాధి హామీ పథకం సిబ్బందితో సమీక్షించారు. సమావేశంలో పలు అంశాలపై సమీక్షించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో పనులు సక్రమంగా జరిగేటట్లు చూడాలన్నారు. కార్యక్రమంలో రెండు మండలాల ఏపీఓలు, సిబ్బంది పాల్గొన్నారు.



మత్స్యశాఖ కార్యాలయం వద్ద బాగు చేసి వ్యర్థాలను తగులబెట్టిన సిబ్బంది



వృథాగా ఉన్న వాటర్ ట్యాంకువద్ద శుభ్రం చేసిన దృశ్యం

● ఎట్టకేలకు పట్టించుకున్నారు..!

సాక్షి ఎఫెక్ట్..

ఒంగోలు: ప్రభుత్వ భవనాల సముదాయం అపరిశుభ్రతకు నెలవుగా ఉండడంతో 'కలెక్టర్‌గారూ...కాస్త పట్టించుకోరూ' అన్న శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి స్పందించారు. జిల్లా యంత్రాంగం ఆదేశాలతో పలు ప్రభుత్వ కార్యాలయాల వద్ద పరిశుభ్రత కార్యక్రమాలు చేపట్టారు. ముఖ్యంగా ప్రధాన ద్వారం వద్ద, జిల్లా ఉపాధి కార్యాలయం, జిల్లా ఉమ్మడి పరీక్షల విభాగం వద్ద, ఏపీ వైద్య విధాన పరిషత్‌కు వెళ్లే మార్గం వద్ద , జిల్లా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయం వద్ద ఉన్న రిసెప్షన్ కౌంటర్‌ను సోమవారం శుభ్రం చేశారు. ఈ భవనాల సముదాయంలో పూడుకుపోయిన కాలువలను శుభ్రపరిచే పనిలో పారిశుధ్య విభాగం సిబ్బంది నిమగ్నమయ్యారు. ఈ భవనాన్ని మంగళవారం జిల్లా అధికారులు తనిఖీచేయాలని నిర్ణయించడంతో కొంత రూపురేఖలు మారాయి. అయితే ఇంకా ఉద్యానవన శాఖ, ఆయుష్ శాఖ విభాగానికి వెళ్లే మార్గంలోను మార్పు కనిపించడంలేదు .



ప్రధాన గేటు వద్ద శుభ్రత



ఎంప్లాయిమెంట్, డీసీఈబీ కార్యాలయాల మధ్య..